# పల్లెల అభివృద్ధికై పాటుపడండి!

ప్రేమస్వరూపులారా! ప్రభవ, విభవ, శుక్ల, ప్రమోదూత, ప్రజోత్పత్తి, అంగీరస, శ్రీముఖ, భావ, యువ, ధాత, ఈశ్వర, బహుధాన్య, ప్రమాధి విక్రమ..... ఇత్యాది అరవై సంవత్సరములున్నవి. ప్రభవ మొదలుకొని అక్షయ వరకు అరువది సంవత్సరములు. అక్షయనామ సంవత్సరములను రెండింటిని గడిపినది ఈ దేహము. మానవత్వములో దివ్యత్వమును గుర్తించడానికి ఈ సర్వజిత్ నామ సంవత్సరము ప్రధానమైనది. మానవునకు ఎన్నియో ఆశలుంటున్నాయి. అయితే, సత్యసంకల్పముతోకూడిన ఆశలను ఫలింపజేసే సంవత్సరమే 'సర్వజిత్'. ఈ సంవత్సరములో నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక ఇత్యాది అన్ని రంగములూ ముందంజ వేస్తాయి. అయితే, మనము సత్యసంకల్పాలను పెట్టుకోవాలి. సత్యసంకల్పము గలవానికి ఎట్టి లోపమూ ఉండదు. సత్యసంకల్పము ప్రతి ఒక్కటీ విజయాన్నే చేకూరుస్తుంది. ఆ పట్టుదలను మనము వదలకుండా గట్టిగా పట్టుకోవాలి. 'జిత్' అనగా విజయము. 'సర్వజిత్' అనగా అన్ని విధములైన విజయాలకు ఇది కేంద్రము. అరవై సంవత్సరాలలో ప్రధాన మైనటువంటిది ఈ సంవత్సరము. మనము అభివృద్ధికి రావలెనంటే ఈ సర్వజిత్ నామ సంవత్సరంలో సత్యసంకల్పములను పోషించుకోవాలి. సత్యసంకల్పము కలిగి అపజయము పొందినవారు ఎక్కడా కనిపించరు. కనుక, మీరు సత్య సంకల్పములను హృదయములో నింపుకొని సర్వజిత్ నామ సంవత్సరాన్ని సంతోషంగా, సుఖంగా, ఆనందంగా అనుభవించండి.

**'సర్వజిత్' అనేది పార్వతి పెట్టిన పేరు**

ఈ సంవత్సరానికి 'సర్వజిత్' అని పేరు రావటానికి మూలకారణం పార్వతియే. పార్వతి ఈశ్వరునికోసం అనేక సంవత్సరాలు నిద్రాహారములు మాని కఠిన తపస్సు చేసింది.



sri sathyasai vahanamrutam

ఈశ్వరుడు ఆమె తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమై, "ఈనాడు నీ అభీష్టము ఫలించింది. నీవు వచ్చి నన్ను చేరవచ్చు", అన్నాడు. ఆమె ఈశ్వరుని చేరడానికి పూర్వం అనేకమంది దేవతా స్త్రీలు వచ్చి ఆమెను విమర్శిస్తూ వచ్చారు.

**"నీవు బాలవే కద గౌరమ్మా**
**సాంబశివుడు ముసలివాడమ్మా**
**తలనిండా జడలవాడమ్మా**
**తాను కట్టింది పులిచర్మమమ్మా**
**ఎద్దు వాహనమెక్కుతాడు**
**ఏ ప్రొద్దూ తిరుగుచుండువాడు**
**పుట్టలోని పాములు చుట్టుకున్నాడమ్మా**
**గుట్టు తెలియక నీవెట్లు వరించితివి?**
**ఒక ఇల్లు లేదు, వాకిలి లేదు**
**ఒలుకుల్లో పండుకుంటాడు"**

"భిక్షమెత్తుతూ తిరిగే ఆ ముసలివాణ్ణి నీవెందుకు ఆశిస్తున్నావు?" అని ప్రశ్నించారు. అప్పుడు పార్వతి, "మీరు అతని దేహమును మాత్రమే చూస్తున్నారు గాని, ఆత్మతత్త్వమును గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. ఆ దివ్యత్వమును నేను ఆశిస్తున్నాను. దివ్యత్వము ఏనాటికీ మారేటటువంటిది కాదు", అని సమాధానం చెప్పింది. ఈశ్వరుడు పార్వతిని తన వెంట తీసుకొని వెళ్ళాడు. ఆమె అన్నివిధములుగా సుఖపడుతూ వచ్చింది. పార్వతి అన్ని కష్టములను అధిగమించి తన అభీష్టమును సాధించిన దినమే 'సర్వజిత్' నామ సంవత్సర ఉగాది దినము. ఈ పేరు పార్వతి పెట్టినదే! 'సర్వజిత్' తరువాత 'సర్వధారి' నామ సంవత్సరము. 'సర్వధారి' తరువాత 'విరోధి', 'వికృతి'. 'వికృతి' అనగా అనేక వికారములు చేరినటువంటిది. చివరిగా వచ్చేవి దుందుభి, రుధిరోద్గారి, రక్తాక్షి, క్రోధన, అక్షయ. **దైవత్వము ఎప్పుడుకూడను అక్షయ నామ సంవత్సరమునందే అవతరిస్తుంది. ఈ దేహము అక్షయనామ సంవత్సరములోనే పుట్టింది. బ్రహ్మ ముహూర్తంలో ఆరు గంటలకు పుట్టినటువంటిది** ఇది. ప్రతి ఒక్క విషయంలో మనము అంతరార్థాన్ని గుర్తించి



sri sathyasai vachanamrutam

వర్తించినప్పుడు దానియొక్క మంచిచెడ్డలు తెలుస్తుంటాయి.

**చెన్నై ప్రజల దాహార్తి తీర్చిన 'సాయిగంగ'**

సర్వజగత్తునకు జలమునందించునది పార్వతియే! ఆమెకు ఈశ్వరుడు ఈవిధమైన వరము ప్రసాదించాడు. పార్వతియొక్క స్వరూపమే గంగ. కనుకనే, 'గంగాదేవి' అని పూజిస్తారు. నేను పది సంవత్సరములకు పూర్వము మద్రాసుకు వెళ్లాను. అక్కడ 'రెడ్ హిల్స్' దగ్గర ఒక పెద్ద ట్యాంకు ఉంది. ఆ ట్యాంకునుండి మద్రాసు అంతటికీ నీరు సరఫరా అవుతుంది అని చెప్పారు. ట్యాంకులోనే వాటర్ లేదు, ఇంక ఏమి సప్లై చేస్తుంది! పది సంవత్సరాలుగా అందులో నీరు లేదని చెప్పారు. పిల్లలు అక్కడక్కడ పడిన వర్షపు నీటిని త్రాగుతూ కనిపించారు. అది చాలా కలుషితమైన నీరు. ఆ నీటినే త్రాగటానికి, వంట చేయటానికికూడా ఉపయోగిస్తున్నారని చెప్పారు. 'స్వామీ, ఈ ట్యాంకుకు నీరెప్పుడు వస్తుంది?' అని అడిగారు. ప్రతి ఒక్కదానికి కాల, కర్మ, కారణ, కర్తవ్యములు కలసి రావాలి. నేను దీనిని దృష్టిలో పెట్టుకున్నాను. "ఇంక పది సంవత్సరములవరకు నేను ఈ మద్రాసులో కాలుపెట్టను. నేను మద్రాసు అంతటికీ నీరు అందించి, ఆ నీటిద్వారా పంటలు పండించి, ప్రజలు పరిశుద్ధమైన జలమును త్రాగే సమయంలో ఇక్కడికి వస్తాను", అని చెప్పాను. పది సంవత్సరములు గడచిపోయినాయి. మొన్నటి దినము నేను వెళ్ళినాను. ఎక్కడ చూసినా నీరే! ఆ నీరు త్రాగటానికేగాక పంటలు పండించడానికికూడా ఉపయోగిస్తున్నారు.

బ్రిటీషువారు రెండు వందల సంవత్సరములు మద్రాసులో జీవిస్తూ వచ్చారు. ఆరోజుల్లో రోడ్లు లేవు, కార్లు లేవు. వాళ్ళు గుఱ్ఱాలపైన ఎక్కడెక్కడికో వెళ్ళి, కొండలంతా ఎక్కి ఎక్కడెక్కడ నీరుందో చూసుకొనే వారు. కాని, కడపటికి వాళ్ళు వెళ్ళే సమయంలోకూడను నీటి సమస్య తీర్చలేదు. డబ్బున్న శ్రీమంతులు ట్యాంకర్లలో మంచినీళ్ళు తెప్పించుకొని త్రాగుతూ వచ్చారు. కాని, what about the poor people? బీదల గతి ఏమిటి? ట్యాంకర్లలో నీళ్లు తెప్పించు కోవడానికి వాళ్ళవద్ద డబ్బు లేదు. నేను ఒక దినము తేనామ్‌పేటలో దిగాను. అక్కడికి అందరూ వచ్చారు. 'స్వామీ! త్రాగటానికి మాకు నీరు లేదు"

srisathyasaivachanamrutam

అన్నారు. ఆరోజు ప్రైమరీ స్కూల్‌కి సెలవు కావడంచేత చిన్న చిన్న పిల్లలందరూ అక్కడికి పరుగెత్తుకొని వచ్చారు. అందరూ నా దగ్గరికి వచ్చి, “స్వామీ! మాకు త్రాగటానికి నీరు కావాలి” అని ప్రార్థిస్తూ వచ్చారు. “తప్పకుండా వస్తుంది నాయనలారా! నేను కృష్ణనుండి తెప్పించి ఇస్తాను” అని చెప్పాను. చెప్పినట్లుగానే వాళ్ళకు కృష్ణాజలము నందించాను.

కృష్ణా, గోదావరి, గంగ మూడింటినీ చేరుస్తామని బ్రిటీషువారు ప్రామిస్ చేశారు. కాని, ఏమీ చేయలేదు. త్రాగునీటికి, పంటలకు నీరందించే నిమిత్తం మేము రెండు వందలకోట్లు ఖర్చు పెట్టవలసివచ్చింది. ఆ నీటిని ఇప్పుడు వాళ్ళు ఆనందంగా త్రాగుతున్నారు. నేను మొన్న తేనామ్‌పేటకు వెళ్ళినప్పుడు “స్వామీ! మేమిప్పుడు చల్లనినీరు, తీయని నీరు త్రాగుతున్నాము. మీకు ఏవిధంగా కృతజ్ఞతలు చెప్పగలము! మీకు కృతజ్ఞతలు చెప్పుకోవడానికి మాటలు చాలవు”, అన్నారు. దైవము ఏమైనను చేయవచ్చు. కాని, తెలివిలేని మానవులు తెలుసుకోలేకపోతున్నారు. అటువంటి ‘ఫూల్స్’కు తగినరీతిగా బుద్ధి చెప్పండి. వాళ్ళ దగ్గర కావలసినంత డబ్బుంటున్నది. కాని, వాళ్ళు భిక్షగాళ్ళకు ఒక నయాపైసా ఇవ్వరు. నేను తేనామ్‌పేట ప్రజలకు చెప్పాను, “ఒకరు ఇవ్వవలసిన అవసరం లేదు. సృష్టించినటువంటి దైవమే మీకు సర్వమూ ఇవ్వగలడు. కనుక, మీకు ఏది కావలసినా దైవాన్ని ప్రార్థించండి.” నేను మొన్న వెళ్ళినప్పుడు వాళ్ళందరూ అక్కడికి వచ్చారు. తమకు తీయని నీరు అనుగ్రహించినందుకు స్వామికి కృతజ్ఞతలు తెల్పుకున్నారు. “ఈ నీటిని మీరు త్రాగి సుఖించండి, ఆనందంగా ఉండండి. నాకంతే చాలు”, అని చెప్పాను. ఇప్పుడు ఇంటింటికీ, చిన్నచిన్న గుడిసెలకుకూడను పైపులు వేసి అందరికీ నీరందే ఏర్పాటు చేశారు. అందరూ తీయని నీరు త్రాగుతున్నారు. నా హృదయమంతా తీయని నీరే! సర్వుల సుఖమే నా సుఖము. “లోకాస్సమస్తా స్సుఖినో భవంతు” అనే ప్రార్థనయొక్క అంతరార్థమిదే! మీరందరుకూడను ఈవిధంగా ప్రార్థన చేయండి.

**ఉభయ గోదావరి జిల్లాలకు మంచినీటి పథకం**

తరువాత ఈస్టు గోదావరి, వెస్టు గోదావరి జిల్లాలలో వాటర్ ప్రాజెక్టు ప్రారంభించాము. వెస్టు గోదావరి జిల్లా అధ్యక్షుడు డా॥ భాస్కరరావు ఇక్కడే ఉన్నాడు. ఈ ప్రాజెక్టు నిమిత్తం

చాలా శ్రమపడ్డారు. క్రింద ఉన్నటువంటి గంగను పైకి తీసికొని వెళ్ళాలంటే చాలా కష్టము. "మీ పని మీరు చేయండి. దాని ఫలితము నేను చూచుకుంటాను", అని చెప్పాను. రామకృష్ణ ('లార్సెన్ అండ్ టుబ్రో' మాజీ వైస్ ప్రెసిడెంటు), కొండలరావు (ఆంధ్రప్రదేశ్ మాజీ ఛీఫ్ ఇంజనీరు) వీరిరువురినీ నేను పంపించాను. మొన్న పోయి చూస్తే ఆ నీళ్ళు 'ఎంత పైకి పోయినాయి! ఎంత పైకి పోయినాయి!' అని ఆశ్చర్యపడ్డారు. అది మాటలతో చెప్పే విషయం కాదు; వెళ్ళి చూస్తేనే అర్థమౌతుంది. ఆ గుట్టలమీద నివసిస్తున్న మనుష్యులు ఇతర మనుష్యుల మాదిరి జీవించడం లేదు. వాళ్ళు క్రిందికి దిగేటటువంటివారు కాదు. ఎందుకంటే వాళ్ళకు భయము! మనుష్యులను చూస్తే భయము! "స్వామీ! మేము గోదావరిగట్టుపైననే ఉన్నాము. కాని, ఈనాటివరకు గోదావరి నీరు ఒక చుక్కైనా త్రాగలేదు", అన్నారు. అలాంటివాళ్ళు ఇప్పుడు ఇళ్ళకు పైపులు వేసుకొని ఆనందంగా నీటిని త్రాగుతున్నారు. వాళ్ళలో అనేకమంది, ఆడవాళ్ళు కూడా, మొన్న ప్రశాంతి నిలయానికి వచ్చారు. ఇక్కడ కనిపించిన భక్తులతో 'ఎంతటి అదృష్టవంతులు మీరు! అయితే, మేముకూడా అదృష్టవంతులమే! మేముకూడా ఎట్టకేలకు స్వామిదగ్గరకు చేరుకున్నాము", అన్నారు.

ఈవిధంగా సర్వజనులకు తృప్తి కలిగేటట్లు అనేక గ్రామాలకు నీరందించాము. వాళ్ళు తమ భాషలో పాటలు రాసి డ్యాన్సు ఆడుతూ స్వామికి కృతజ్ఞతలు తెలియజేశారు. "సత్యసాయి అందించిన నీరిది. ఒక్క చుక్కైనా వ్యర్థం చేయకూడదు. ఈ నీరు త్రాగి మన జీవితమును పోషించుకుందాం", అనే అర్థాన్నిచ్చే పాటలు రాసి, వాటికి చక్కని రాగం కూర్చి సామూహికంగా పాడుతూ డ్యాన్సు చేస్తూ వచ్చారు. వాళ్ళ నీటి సమస్య తీరిపోవడంచేత ఆ పల్లెలవాళ్ళు ఎంతో ఆనందిస్తున్నారు. పెద్దపెద్ద పాత్రల్లో నీరు నింపుకొని వాటిని కావడిలో ఉంచుకొని తీసికొని వెళుతున్నారు. ఆ దృశ్యం చూడటానికే ఎంతో సంతోషంగా ఉంటుంది. వారిని చూసి పట్టణవాసులు నేర్చుకోవలసింది ఎంతో ఉంది. అంతటి ఆనందాన్ని వారు అనుభవిస్తున్నారు. నిన్నటి దినము రామకృష్ణ, కొండలరావు వచ్చారు. "స్వామీ! మీరు తప్పక రావాలి. అక్కడి ప్రజలందరూ చాలా ప్రార్థిస్తున్నారు" అన్నారు. వస్తానని చెప్పాను. త్వరలో నేను రాజమండ్రికి వెళతాను. అయితే, రాజమండ్రినుండి ఆ ప్రాంతానికి కారులో



sri sathyasai vahini amrutam

వెళ్ళటానికి వీలులేదు; నడుచుకొనే పోవాలి. "మేము స్వామికి ఏమాత్రము శ్రమ కలిగించము. స్వామిని నడిపించకుండా తీసుకువెళ్ళే ప్రయత్నం చేస్తాము. మా భుజాలపైన ఎత్తుకొని అయినా మీకు ఎటువంటి శ్రమ లేకుండా మా గ్రామమునకు తీసుకు వెళతాము" అన్నారు. ఆవిధంగా పల్లెలవాళ్ళు ఎంతో ఆనందిస్తున్నారు.

**మానవ సేవయే మాధవ సేవ**

ఈనాడు పవిత్రమైన ఉగాది పర్వదినమును పురస్కరించుకొని పల్లెల అభివృద్ధిని కోరి, ఒక సేవా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాము. ప్రతి గ్రామంలోను ప్రతి ఇంటినీ మనము పరిశుద్ధం గావించాలి. లోపల, వెలుపల పరిశుద్ధంగా ఉండేటట్లు తగిన చర్యలు తీసుకోవాలి. వారి పిల్లలనుకూడను పరిశుద్ధమైన వారుగా తయారుచేయాలి. గ్రామగ్రామాలకు వెళ్ళి ఈవిధమైన సేవలందించాలని ఆశిస్తున్నాము. దీనికి కొన్ని కోట్లు ఖర్చవుతుంది. దానికి మేము భయపడము. డబ్బులు వస్తాయి, పోతాయి. కాని, మనము చేసిన సహాయం ఏనాటికీ పోదు. కాబట్టి, గ్రామాల అభివృద్ధికి మనము అనేక రకములుగా ప్రయత్నించాలి. దానికి ఈ ఉగాది పండుగనాడే పునాది వేస్తున్నాము. పిల్లలు, పెద్దలు, బీదలు, షావుకార్లు అందరూ కలిసి పనిచేయాలి. అందరినీ కలపడానికి సేవయే ముఖ్యమైనది. యూనిటీని అభివృద్ధిపరచి పల్లెలు, పట్టణములు రెండూ ఒక్కటిగా ఉండేటట్లు చేయాలి. ఈవిధంగా త్వరలోనే తయారు చేస్తాము. పని ఈనాడే ప్రారంభిస్తున్నాము. వచ్చే సంవత్సరం ఉగాది పండుగనాటికి అన్ని గ్రామాలనూ ఆవిధంగా తీర్చిదిద్దాలని మా ఆశ. ఈ సేవా కార్యక్రమంలో మీరందరూ, పిల్లలుకూడా చేరాలి. ఇది దైవసేవగానే భావించాలి. Service to man is service to God (మానవసేవయే మాధవసేవ).

ఈనాడు మనము వ్యష్టిస్థాయిలో ఉంటున్నాము. యూనిటీని పెంచుకోవాలి. దేశమంతా ఒక్కటి కావాలి. మద్రాసులో జరిగిన పబ్లిక్ మీటింగులో కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, గవర్నర్లు, ఇంకా అనేకమంది ఐ.ఎ.ఎస్. ఆఫీసర్లు పాల్గొన్నారు. అశేష ప్రజానీకం అక్కడ చేరారు. ఈవిధంగా అందరూ ఏకమై సేవలో పాల్గొనాలి. అందరూ కలిస్తే

sri sathyasai vachanamrutam

ఈ ప్రపంచాన్నంతటినీ ఒక్క క్షణంలో మంచిగా మార్చవచ్చు. అచంచలమైన దీక్షతో మనము ఈ ప్రయత్నములో ప్రవేశించాలి. ఎవరి దగ్గరనుండి కూడను మీరు నయాపైసా అడుగకూడదు. మీకు నేనున్నాను. మీకు ఏది కావలసినా నన్ను అడగండి, నేను సప్లై చేస్తాను. ప్రవహించే నదులన్నిటికీ సముద్రమే ఆధారం. అదేరీతిగా మీరు ఎవరికి ఏ సేవలు చేసినా అన్నిటికీ మీకు నేనే ఆధారం. కాబట్టి, మీరేమీ జంకు పెట్టుకోకండి. అడగటానికి ఏమాత్రము భయపడకండి. నేను తప్పక అన్నీ అందిస్తాను. కనుక, మీరందరూ సిద్ధంగా ఉండండి. ఆడ, మగ ఇరువురూ ఇందులో పాల్గొనాలి.

**అందరూ సుఖంగా ఉండటమే స్వామికి సుఖము**

నిన్నటి దినము బొంబాయివాళ్ళు వచ్చారు. వాళ్ళు గొప్ప ధనవంతులు. "సముద్రముదగ్గర స్వామియొక్క ధ్వజస్తంభము స్థాపిస్తాము. అది ఎన్నో వందల అడుగుల ఎత్తుంటుంది. దానినుండి వెలువడే లైటు అందరికీ కనిపించాలి. 'సాయిరాం' అనే పేరుతో దానిని స్థాపిస్తున్నాము", అన్నారు. దీనికి కొన్ని కోట్లు ఖర్చవుతుంది. "అది పూర్తి అయిన తరువాత వచ్చి మేము స్వామి దర్శనం చేసుకుంటాము", అన్నారు. బొంబాయివారుకూడా ఎంతో చేస్తున్నారు. అన్నీ బాగా చేస్తున్నారుగాని, బొంబాయి సిటీని మాత్రము చాలా dirty (మురికి)గా పెట్టుకుంటున్నారు. ముందు ఆ 'పొల్యూషన్'ను నిర్మూలం చేయండి. ఈ పని చేయటానికి పూర్వం ప్రయత్నాలు జరిగాయి. కాని, సాధ్యం కాలేదు. ఎందుకంటే పోటు సమయంలో సిటీ సముద్ర మట్టానికి దిగువన ఉంటుంది. నీరు క్రిందికే ప్రవహిస్తుందిగాని పైకి పోదు. ఆ 'డ్రైనేజీ' వాటర్‌ని పంప్ చేస్తేగాని నగరాన్ని సరియైనరీతిలో తీర్చి దిద్దడానికి వీలుకాదు. ఈ పని వారు చేయగలరు. నేను గట్టిగా చెప్పాను, 'ఆ పని మీరు చేయండి, నేను వస్తాను', అని. వారంతా కలసి చేయగలరు. వారందరికీ అట్టి పట్టుదలకూడా ఉన్నది. భారతదేశమంతా అందంగా, ఆనందంగా, సుఖంగా, సంతోషంగా ఉండాలి. 'లోకాస్సమస్తాః సుఖినో భవంతు'. అందరూ సుఖంగా ఉండటమే స్వామికి సుఖము. స్వామికి ప్రత్యేకమైన సుఖము అక్కర్లేదు. మీ అందరి సుఖమే నా సుఖము. మీ ఆనందమే నా ఆనందము. కాబట్టి, ఏ సేవ చేసినా మీ ఆనందముకోసం చేయండి.

**మానవతా విలువలే మన పంచప్రాణములు**



srisathyasaivachanamrutam

ఈనాడు అన్నింటికన్న ప్రధానమైనది నీరు. నీరే ప్రాణాధారము. అన్నము లేకపోయినా నాలుగు దినాలుండవచ్చునుగాని, నీరు లేకపోతే నాల్గు నిమిషాలైనా ఉండటానికి వీలుకాదు. ఇకపైన వర్షాలు ఎక్కువగా వస్తాయి. **ఎవ్వరికీ ఏ కొరతా ఉండదు. ఇవన్నీ సరిదిద్దుటకే నేనిక్కడికి వచ్చాను. మీ పొరపాట్లను, తప్పులను క్షమించి తప్పక మీకు ఆనందాన్నిస్తాను.** మీరందరూ ఐకమత్యంగా ప్రేమను కలిగి ఉండాలి. పంచప్రాణములనగా ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములు కావు. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలే మన పంచప్రాణములు. సత్యమున్నచోట ధర్మము తనంతట తానే పుడుతుంది. ధర్మమువలన శాంతి కలుగుతుంది. శాంతినుంచి ప్రేమ ఆవిర్భవిస్తుంది. మొదటిది సత్యము, చివరిది ప్రేమ. కాబట్టి సత్యము, ప్రేమ రెండూ చేరితే సర్వమూ సిద్ధిస్తుంది. అతిశీఘ్రకాలములోనే ప్రపంచమంతా ఒక్కటిగా ఏర్పడుతుంది. ఈవిధమైన ఏకత్వానికి పిల్లలు తగిన కృషి చేయాలి. పిల్లలకు మంచి ఇంద్రియ శక్తి ఉంటుంది. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక బలములు మూడూ భద్రంగా ఉంటాయి. వీటిని సద్వినియోగం చేసుకోండి. మీ ఇంద్రియాలను అపవిత్రము చేసుకోకండి. అప్పుడే మీరు ప్రపంచానికి గొప్ప సేవ చేసినవారవుతారు. ఏదో దేవాలయానికి వెళ్ళి సున్నం కొట్టి వచ్చి సేవ చేసినామంటే సరిపోదు. ప్రతి ఇల్లుకూడను పరిశుభ్రంగా ఉండాలి. పరిశుభ్రంగా ఉంటే ఎవరి ఇంటికైనా మనము పోవచ్చును.

**నేను మాలవాళ్ళ ఇళ్ళకుకూడా వెళ్ళేవాడిని**

పుట్టపర్తిలో మాలవాళ్ళ ఇళ్ళు ప్రత్యేకంగా ఉండేవి. నేను వాళ్ళ ఇళ్ళకుకూడా వెళ్ళేవాడిని. ఇక్కడ మాల నాగప్ప అనే వ్యక్తి ఉండేవాడు. నాగప్ప అల్లుడు రాములు. అతను థర్డ్‌ఫామ్‌వరకు చదువుకున్నాడు; స్వామిగురించి కొంచెం తెలుసుకున్నటువంటివాడు. ఒకనాడు నన్ను వాళ్ళింటికి భోజనానికి పిలిచాడు. నేనీ విషయాన్ని సుబ్బమ్మకు చెప్పాను. "అయ్యయ్యో స్వామీ, మీరు మాలవాళ్ళ ఇళ్ళకు పోతారా? పోవద్దు" అన్నది. నేను పోయేతీరుతానన్నాను. 'నీవుకూడా నావెంట రా' అని చెప్పాను. సుబ్బమ్మవాళ్ళు బ్రాహ్మణులు. "స్వామికోసం నేను ఏమైనా చేస్తాను", అని చెప్పి నావెంట వచ్చింది. నేను

sri sathyasai vahini

ముందు పోతున్నాను. నాకంటే ముందుగా రాములు నడుస్తున్నాడు. సుబ్బమ్మ నా వెనుక వస్తున్నది. మేమిద్దరము అక్కడికి వెళ్ళేసరికి ఆ ప్రాంతమంతా ఎంతో పవిత్రమైన పరిమళంతో నిండిపోయింది. "ఎక్కడినుండి తెచ్చారు మీరీ పరిమళాన్ని?" అని నేను అడిగాను. "స్వామీ! మేము ఏదీ తీసికొని రాలేదు. ఈ పరిమళము మీనుండే వస్తున్నది" అన్నాడు. నేను లోపలికి అడుగుపెట్టాను. సుబ్బమ్మకూడా ఎంతో ఆనందంగా నావెంట వచ్చింది. అప్పటికి ఆమె వయస్సు 62 సంవత్సరాలు. నాకొక అల్యూమినియం ప్లేటులో కొంచెం అన్నం పెట్టారు. వాళ్ళదగ్గర ఉన్నది అదే! అప్పటికింకా స్టెయిన్‌లెస్ స్టీలు ప్లేట్లు రాలేదు. సుబ్బమ్మకు ఇంకొక తట్టలో పెట్టారు. మొట్టమొదట సుబ్బమ్మకు తాము బ్రాహ్మణులమనే అభిమానముండేది. కాని, స్వామి చెప్పిన తరువాత ఆమెలో మార్పు వచ్చింది. 'ఛీ, ఇలాంటి అభిమానము నేను పెట్టుకోకూడదు' అని భావించింది. ఆమెకూడా నాతోపాటు వాళ్ళింట్లో భోజనం చేసింది.

**స్వామి సేవలో తరించిన పుణ్యజీవి సుబ్బమ్మ**

ఊర్లోకి మేము తిరిగి వచ్చేసరికి ఊరివారంతా ఏకమై "సుబ్బమ్మ మాలదైపోయింది, సుబ్బమ్మ మాలదైపోయింది" అని హేళన చేయసాగారు. "ఆమె నెవ్వరూ ముట్టకండి" అన్నారు. అప్పుడామె "నాకు కావలసింది కూడా అదే! నన్నెవ్వరూ ముట్టకండి. స్వామి ఒక్కరు ముట్టితే చాలు. నాకెవ్వరూ బిడ్డలు లేరు. నా బిడ్డను ఇంకొకరికివ్వనక్కర్లేదు; ఇంకొకరి బిడ్డను నేను తెచ్చుకోనక్కర్లేదు. నాకు స్వామి ఒక్కరుంటే చాలు", అన్నది. ఆమె ఇంటికి వచ్చిన ప్రతి భక్తునికి అన్నం వండి పెట్టేది. అందుకు తగినట్లుగా అదృష్టం కలసివచ్చి ఆమెకు చెందిన భూముల్లో సంవత్సరానికి రెండు, మూడు పంటలు సమృద్ధిగా పండి ఇల్లంతా ధాన్యంతో నిండిపోయేది. ఆ బియ్యం సంచులను ద్వారంనుండి లోపలికి తీసుకు పోవడానికి వీలుకాక పైన గవాక్షంనుండి లోపలికి పోసేది. ఈవిధంగా స్వామి సేవలో తరించింది సుబ్బమ్మ.

ఒకనాడు నేను సుబ్బమ్మను అడిగాను, "సుబ్బమ్మా! నీకేమి కావాలి?" అని. "నాకేమీ వద్దు స్వామీ, నేను మరణించేముందు మీ చేతులద్వారా నా నోట్లో ఇంత నీరు పోస్తే చాలు",

sri sathyasai vachanamrutam

అన్నది. తప్పక అలాగే జరుగుతుందని మాటిచ్చాను. ఒక పర్యాయం నేను మద్రాసునుండి కారులో తిరిగి వస్తున్నాను. అప్పటికి ముందురోజే సుబ్బమ్మ మరణించింది. ఆమె దేహాన్ని బుక్కపట్నంనుండి స్మశానానికి మోసుకొని రావడానికి ప్రయత్నం చేస్తున్నారు. నన్ను చూస్తూనే కొంతమంది పరుగెత్తుకుంటూ వచ్చి "స్వామీ, సుబ్బమ్మ నిన్నటి దినమే మరణించింది" అని చెప్పారు. "అది మీ భ్రాంతి. సుబ్బమ్మ మరణించలేదు. ఆమె నన్ను చూసేంతవరకు పోదు" అని చెప్పి నేను కారుని వెనక్కి తిప్పుకున్నాను. అప్పుడు కారు డ్రైవింగు ఎవరు చేస్తున్నారు? నేనే! ఆ కారును అక్కడే నిలిపి ఆమె ఇంటికి వెళ్ళాను. ఆమె తల్లి అప్పటికి బ్రతికే ఉన్నది, పాపం! "స్వామీ, నిన్న రాత్రివరకు 'సాయిరాం, సాయిరాం' అని మిమ్మల్నే తలుచుకుంటూ ఉండినది. 'స్వామి వచ్చారా, స్వామి వచ్చారా' అని అందరినీ అడుగుతూ వచ్చింది" అని చాలా బాధపడుతూ చెప్పింది. సుబ్బమ్మ దేహంపైన కప్పి ఉంచిన బట్టను తీసి పారవేశాను. 'సుబ్బమ్మా! సుబ్బమ్మా!' అని పిలిచాను. కళ్ళు తెరిచింది. ఎప్పుడైనా సరే, భగవంతుడు మాట ఇస్తే మరచేవాడు కాదు. 'నీకు కావలసింది నా చేతులమీదుగా నీరు పోయడమే కదా! ఇదిగో తీసుకో', అని చెప్పి ఒక తులసీ దళాన్ని నీటిలో ముంచి ఆమె నోట్లో పోశాను. 'నేను ధన్యురాలినైనాను స్వామీ!' అంటూ ఆమె నా రెండు చేతులూ గట్టిగా పట్టుకుని కళ్ళకద్దుకుంది. అందరూ ఆశ్చర్యపడ్డారు. 'స్వామీ! మీ సెలవుకోసం కాచుకొని ఉన్నాను. సెలవివ్వండి. ఇక నేను వస్తాను', అన్నది. పర్మీషన్ ఇచ్చాను. ఆమె నాలో చేరిపోయింది. అందువల్లనే, సుబ్బమ్మ పేరుతో ఇక్కడొక కాలనీ కట్టాను. ఆమె చాలా గొప్ప పుణ్యజీవి. ఆమె అప్పుడప్పుడు కిటికీలో నుంచి ఈశ్వరమ్మతో మాట్లాడేది. "ఈశ్వరమ్మా! స్వామిని నీవు కన్నావు, నేను పెంచినాను. కాబట్టి, నీవు దేవకీదేవివి. నేను యశోదను", అనేది. "సుబ్బమ్మా! ఇంతమంది భక్తులను పోషించిన నీకు సరియైన ఫలితం రాదా? తప్పక వస్తుంది" అని చెప్పేది, ఈశ్వరమ్మ. సుబ్బమ్మ తాను వెళ్ళేముందు ఈశ్వరమ్మదగ్గరకు వచ్చి, "నేను వెళ్లిపోతున్నాను. నీవు సత్యాన్ని బాగా చూసుకో", అని చెప్పింది. ఇద్దరూ కంటిధారలు కార్చారు. ఆ రెండవ దినమే సుబ్బమ్మ ప్రాణం విడిచింది.

sri sathyasai vahini amrutam

**చిన్ననాటినుండే ప్రజల్లో మార్పు తెప్పిస్తూ వచ్చాను**

సుబ్బమ్మ భర్త పేరు నారాయణరావు. ఆయన తన ఇంటిముందున్న తులసీ బృందావనందగ్గర కూర్చునేవాడు. ఆయన పెడమార్గము పట్టినప్పుడు నేను గ్రామంలోని పిల్లలకు కొన్ని పాటలు నేర్పించి, ఆయన ఇంటిముందునుండి పాడుకుంటూ వెళ్ళమని చెప్పాను.

**"మిండగత్తెల చెంతకు పోకు**
**ఖండితముగ నీవు కడు నీచుడౌతావు**
**కులమువారలు నిన్ను కుండ ముట్టనివ్వరు**
**బంధువులు నిను చూచి బయటెళ్ళగొడతారు**
**స్నేహితులు నిను చూచి చెప్పుతో కొడతారు"**

పిల్లలందరూ ఈ పాటను పాడుకుంటూ గుంపుగా పోయేసరికి ఆయనకి చాలా అవమానమనిపించింది. లోపలికి వెళ్ళి పిల్లలను పిలిపించి "ఎవరు నేర్పించారు మీకీ పాట?" అని అడిగాడు. "రాజు నేర్పించాడండీ" అని చెప్పారు. "నిజమే, ఇది రాజుకు తప్ప మరొకరికి తెలియడానికి వీల్లేదు" అనుకున్నాడు. ఆనాటినుండి అతను చెడ్డభావాలను, చెడ్డ అలవాట్లను వదలిపెట్టాడు. ఆయన ఇంటికి బండ్లనిండా మామిడి పండ్లు వచ్చేవి. వాటిని పిల్లలందరికీ పంచిపెట్టేవాడు.

ఆరోజుల్లోనే చేతిగడియారాలు వాడుకలోకి వచ్చాయి. అప్పట్లో పల్లెల్లో ఎవరైనా చేతికి గడియారం పెట్టుకుంటే వారిని గొప్పవారుగా భావించేవారు. అంతేకాదు. కుక్కలకు పట్టే పిడుదులమాదిరి ముక్కుకింద చిన్నగా మీసాలు పెట్టుకునేవారు. అది ఆనాటి ఫ్యాషన్! దానిని పురస్కరించుకొని ఒక పాట వ్రాసి స్కూలులో పిల్లలకు నేర్పించాను.

**"ఎడమచేతి కడాన ఏందొా తెల్లల బిళ్ళ**
**తోలు పట్టెడ కట్టి యాలాడ గడతారు**
**ఏటి యేషాలప్ప ఇవి?**
**ఇవి కంటితో చూచేకి కాని అవతారాలు**

sri sathyasaivechanamrutam

**ఏటి యేషాలప్ప ఇవి?**
**పొడుగాటి మీసముల్ గొరిగి కత్రించి**
**నాసికముల్ దగ్గ నాల్గుంచుకుంటారు**
**ఏటి యేషాలప్ప ఇవి?"**

ఈవిధంగా ఫ్యాషన్లపై మోజు పోగొట్టి ప్రజలలో ఉన్నత భావాలను నాటడంకోసం పాటలు వ్రాసి పిల్లలచేత పాడించేవాడిని. చిన్నపిల్లలు మొదలుకొని పెద్దవారి వరకు అందరిలో మార్పు తెప్పిస్తూ వచ్చాను. ఈనాటినుండి మనం పల్లెలలో సరియైన మార్పు తెప్పించటానికి పూనుకోవాలి. పల్లెలను పట్టణాలుగా మార్చవలసిన పనిలేదు. ఆవిధంగా మార్చటం నాకిష్టం లేదు. ముందు వాటిని శుభ్రం చేయాలి. పట్టణాలలో అంతా చెడ్డనే! చూడటానికి చక్కగా ప్యాంటు, షర్టు, టై వేసుకుంటారు. కాని, లోపల చూస్తే అన్నీ చెడ్డ భావాలే! మీరు పైకి ఎటువంటి వైట్ డ్రస్సు వేసుకుంటారో లోపలకూడా అటువంటి పవిత్రమైన భావాలను కలిగియుండాలి. ముందు మీలో సరియైన మార్పు తెచ్చుకొని ప్రపంచాన్నికూడా మార్చాలి.

మొన్న ముగ్గురు పిల్లలు ఈశ్వరమ్మను గురించి బుఱ్ఱకథ చాలా చక్కగా చెప్పారు. సుబ్బమ్మనుకూడను చక్కగా వర్ణించారు. నాకెంతో ఆనందము కలిగింది. ఎవరూ ఈవిధంగా వ్రాసినవారు లేరు. (స్వామి ఆ ముగ్గురు పిల్లలను, వారి టీచర్ శ్రీ కృష్ణ భాస్కర్‌ను వేదికపైకి రప్పించి, వారికి నూతన వస్త్రములను బహూకరించి, వారితో కలసి ఫోటోలు తీయించుకొని ఆశీర్వదించారు)

**( సర్వజిత్ నామ సంవత్సర ఉగాది సందేశం - 1, తేదీ 20.03.2007, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vachanamrutam